యూరియా కోసం రైతుల ఆందోళన


ముదునూరు సొసైటీ ఎదుట రైతులు

ఉయ్యూరు రూరల్: అరకట్ట యూరియా కోసం గంటల తరబడి కోపరేటివ్ సొసైటీల ఎదుట నిరీక్షించాల్సిన దుస్థితి మండలంలోని ముదునూరులో మంగళవారం చోటుచేసుకుంది. సోమవారం రాత్రి మండలంలోని ముదునూరు సొసైటీకి యూరియాలోడు వచ్చింది. అయితే మంగళవారం ఉదయం సొసైటీ వద్దకు వచ్చిన రైతులు యూరియా అయిపోయిందని తెలియటంతో సొసైటీ ఎదుట బైఠాయించారు. దీంతో తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంఏవో నిస్సి గ్రేస్, ఉయ్యూరు రూరల్ ఎస్ఐ సురేష్ బాబు, సిబ్బంది ఆధ్వర్యంలో కోపరేటివ్ సొసైటీ, మార్కెటింగ్ శాఖ అధికారుల సహకారంతో రైతులందరికీ యూరియా అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానిక జై కెమికల్స్ యాజమాన్యం తమకు నచ్చిన వారికి యూరియాను అందిస్తున్నారని, యూరియాతోపాటు గుళికలు కూడా కొనుగోలు చేయాలని ఒత్తిడి చేయడంతో అవసరం లేకున్నా గుళికలను కొనాల్సిన పరిస్థితి నెలకొందని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారుల చొరవతో కొందరికి యూరియా ఇచ్చారు. మరో రెండు రోజుల్లో యూరియా అందరికీ అందేలా చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే మండలంలో స్థాయికి మించి యూరియాను సరఫరా చేశామని, అయినప్పటికీ కొరతగానే ఉందని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఏవో హామీ ఇచ్చారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

గండిగుంటలో ఆ నలుగురికే..!

మండలంలోని గండిగుంట కోఆపరేటివ్ సొసైటీ ద్వారా కేవలం నలుగురు, ఐదుగురు రైతులకు మాత్రమే ఎరువును దొడ్డి దారిన పంపిణీ చేసి అధికార యంత్రాంగం మమ అనిపించారని వైఎస్సార్ సీపీ రైతు అభివృద్ధి మండలి సలహా కమిటీ సభ్యులు గొల్లపూడి వేణు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఒక లోడు 450 బస్తాల యూరియా వస్తే కేవలం నలుగురికి మాత్రమే పంపిణీ చేశారని ఆరోపించారు. రైతులందరికీ యూరియాను సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని వేణు కోరారు.

పీఏసీఎస్‌ల వద్ద రైతుల బారులు

తేలప్రోలు(గన్నవరం): ఉంగుటూరు మండలం తేలప్రోలు పీఏసీఎస్ ఆవరణలో మంగళవారం యూరియా కోసం రైతులు బారులుతీరారు. గంటలతరబడి నిరీక్షిస్తే అరకొర మాత్రమే యూరియా సరఫరా చేస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డిమాండ్‌కు అనుగుణంగా యూరియా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆర్టీసీ డిపో ఎదుట ఉద్యోగుల ధర్నా


గన్నవరం డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఎన్‌ఎంయూఏ నేతలు

గన్నవరం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక డిపో ఎదుట మంగళవారం ధర్నా చేపట్టింది. ఈ మేరకు అసోసియేషన్ సభ్యులు డిపో గేటు వద్ద తమ డిమాండ్ల సాధన కోసం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీ.నాగిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణమే పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, వేతన సవరణ ముగిసి రెండేళ్లు పూర్తికావడంతో వెంటనే ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. గవర్నర్‌పేట- 2 డిపోకు చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని లులు సంస్థకు బదలాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే చెల్లించాలని, రిటైర్ అయిన ఉద్యోగులకు గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్మెంట్ వెంటనే చెల్లింపులు చేయాలని కోరారు. ఆర్టీసీలో 8 వేల ఖాళీలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని, నాలుగేళ్లుగా నిలిచిన ఉద్యోగోన్నతులను వెంటనే ఇవ్వాలని, ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని కోరారు. ఈహెచ్‌ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ ద్వారానే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ నాయకులు రాజు, ప్రభాకర్, గ్యారేజ్ కార్యదర్శి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్యకర్త కుటుంబానికి సాయం

కంకిపాడు: కాసరనేనివారిపాలెం గ్రామానికి చెందిన జడా కృపారావు ఇటీవల మృతి చెందటంతో బాధిత కుటుంబానికి నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి వితరణతో రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని మంగళవారం జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అందజేశారు. మాజీ సర్పంచ్ అంబడిపూడి డేవిడ్, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి లంకె రాజ్‌కమల్, నాయకులు జడా రవి, బోరుగడ్డ శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం

పెనమలూరు: కానూరులో ఇంజినీరింగ్ విద్యార్థులు మంగళవారం రక్తదానం చేశారు. వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదనం శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైస్ ఛాన్సలర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్ ప్రారంభించారు. పిన్నమనేని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించగా 102 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. డీన్ డాక్టర్ డి.వెంకట్రావు, డాక్టర్లు కల్యాణ్ చక్రవర్తి, డాక్టర్ జాస్మిన్‌సుల్తానా, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ జె.శివరామ్‌ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.సుష్మాచౌదరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధి శిక్షణ

నున్న(విజయవాడరూరల్): నున్న వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉపాధి శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. నాంది ఫౌండేషన్ ట్రైనర్ డి.పవన్ శర్మ విద్యార్థులకు ఉపాధి శిక్షణ తరగతులను నిర్వహించారు. కళాశాల సెక్రటరీ ఎన్.సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాసరావు మాట్లాడారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ట్రోఫీలు, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు.

కలర్ ప్రింటర్ అందజేత

ఉయ్యూరు: ఉయ్యూరు జెడ్పీ పాఠశాలకు రూ.20 వేల విలువ చేసే కలర్ ప్రింటర్‌ను వితరణగాఅందించారు. ఉపాధ్యాయురాలు శ్రీలత సోదరుడు కాలిశెట్టి సీతారాం ఈ ప్రింటర్‌ను కలవపాముల ఎంపీపీ మోడల్ పాఠశాల హెచ్‌ఎం భారతీలక్ష్మి చేతులమీదుగా మంగళవారం అందజేశారు. హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ మోక్షభాగ్యం పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథన్ జయంతి

గన్నవరం: స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్‌ఆర్.రంగనాథన్ జయంతి సందర్భంగా గ్రంథపాలకుల దినోత్సవం నిర్వహించారు. రంగనాథన్ చిత్రపటానికి గ్రంథాలయ కమిటీ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నర్రా సీతారామారావును సత్కారించారు. గ్రంథాలయాధికారి కే నాగరాజు, రోటరీక్లబ్ అధ్యక్షుడు జీవీ.రవిబాబు, రోటేరియన్లు గన్నె వెంకట్రావు, జాస్తి విజయభూషణ్‌కుమార్, చిమట రామారావు, వెంకటకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ


పెనమలూరులో మందు బిళ్లలు వేస్తున్న సీహెచ్‌వో లక్ష్మయ్య

పెనమలూరు: విద్యార్థులు పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ సాయిలలిత అన్నారు. మండల పరిధిలో మంగళవారం జాతీయ నులి పురుగుల దినోత్సవంలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణకు మందు బిళ్లలను పంపిణీ చేశారు. ఆహారపు అలవాట్లపై జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. బహిరంగ ప్రాంతాల్లో చిరుతిండ్లు, జంక్ ఫుడ్‌ల కు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు హెచ్‌ఎం సుధారాణి, సీహెచ్‌ఎం లక్ష్మయ్య, హెచ్‌వీ నిర్మల, ఎంఎల్‌హెచ్‌పీ షైనీ, ఏఎన్‌ఎం కృష్ణకుమారి, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాత్రల పంపిణీ

ఉయ్యూరు: పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగుల నిర్మూలన మాత్రలు పంపిణీ చేశారు. జాతీయ నులి పురుగు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉయ్యూరు, చిన ఓగిరాల, కాటూరు ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో నులి పురుగు నిర్మూలన మాత్రలు పంపిణీ చేశారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు మాత్రలు అందించారు. చిన ఓగిరాల పాఠశాలలో డాక్టర్ తేజస్విని మాత్రలు విద్యార్థులకు వేశారు. నులి పురుగు నిర్మూలన వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

నున్న(విజయవాడరూరల్): రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి డీఎంఎఫ్ విజయకుమారి సూచించారు. మంగళవారం నున్న గ్రామంలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఎమగ్ర సస్యరక్షణ చర్య లు చేపట్టినట్టయితే భూసారం దెబ్బతినకుండా వుంటుందన్నారు. ఏపీ సీఎన్‌ఎఫ్ విధానంలో రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని, నానో యూరియా పిచికారి చేస్తే మంచిఫలితాలు వస్తాయన్నారు.ఏడీఏ బి.వెంకటేశ్వరరావు, ఏఓ రఘురామ్, ఉద్యాన శాఖ అధికారి పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

గన్నవరం: యూరియా అధిక ధరలకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.సునీల్ హెచ్చరించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం మండలంలోని ప్రైవేట్ ఎరువుల దుకాణదారులకు, ఏపీసీఎస్‌ల సీఈఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. ప్రైవేట్ షాపులు, పీఏసీఎస్‌లకు యూరియా సరుకు వచ్చిన వెంటనే మండల వ్యవసాయ అధికారికి తెలియజేయాలని చెప్పారు. ఒకే రైతుకు ఎక్కువ యూరియా ఇవ్వకుండా రైతుల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా సాధ్యమైనంత వరకు ఎక్కువ మందికి సరఫరా చేయాలని తెలిపారు.

ఏ రైతుకు ఎంత యూరియా సరఫరా చేశారో వివరాలతో కూడిన జాబితాను వ్యవసాయ అధికారికి సమర్పించాలని చెప్పారు. ఎరువుల పంపిణీకి సంబంధించి అమ్మకాల వివరాలను ఎప్పటికప్పుడు ఈపోస్ మిషన్‌లో ఆన్‌లైన్ చేయాలని సూచించారు. గుళికల రూపంలో ఉన్న యూరియానే కాకుండా నానో యూరియాను రైతులు ఉపయోగించవచ్చని చెప్పారు. నానో యూరియా వాడకంపై కూడా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి కె.శివప్రసాద్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ఉంగుటూరు(గన్నవరం): విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు తమవంతు తోడ్పాటు అందించాలని ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సీహెచ్.అనిత పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తోట అనంతయ్య తయారు చేసిన ఇంగ్లిష్ సబ్జెక్టు బుక్‌లెట్‌లను మంగళవారం పదవ తరగతి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ఇంగ్లిష్ సబ్జెక్టులో ఏపీ ఎస్‌సీఈఆర్‌టీ విడుదల చేసిన స్టడీ మెటీరియల్‌ను తన సొంత ఖర్చుతో అనంతయ్య బుక్‌లెట్‌లుగా తయారు చేయించి విద్యార్థులకు ఉచితంగా అందజేయడం ప్రశంసనీయమన్నారు. ఈ తరహా స్టడీ మెటీరియల్ విద్యార్థులకు అందుబాటులో ఉండడం వల్ల సబ్జెక్టుపై అధ్యయనం సులభతరంగా ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఎస్‌ఎంసీ చైర్మన్ పులి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎస్. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలు

ఉయ్యూరు: ఉయ్యూరు ఏజీఅండ్‌ఎస్‌జీ సిద్ధార్థ కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు వేడుకలకు హాజరై మధురస్మృతులను నెమరువేసుకున్నారు. కళాశాల తరగతి గదులు, పరిసరాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కళాశాల కన్వీనర్ తాతినేని శ్రీహరిరావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జలగం వెంకట్రావ్ కళాశాలను ఆగస్టు 12న ప్రారంభించారన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే లక్ష్యంతో ప్రారంభమైన కళాశాల ఏర్పడి 50 ఏళ్లు పూర్తయ్యిందన్నారు. కళాశాల వ్యవస్థాపకులు అడుసుమిలి విశ్వేశ్వరరావు, వెలగపూడి రామకృష్ణ సేవలను కొనియాడారు. వ్యవస్థాపకుల ఆశయాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్యను బోధిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఆఫీసర్ ఎల్.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివనాథ్, ప్రత్యేకాధికారి కె.సత్యనారాయణ, జూనియర్ కళాశాల డైరెక్టర్ జీజేపీ వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్స్ గంటా బాలభాస్కర్‌రావు, వెంకటరాయుడు, ఎం.వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

రూ.1.20 లక్షల వితరణ

గన్నవరం: లక్ష్మీతిరుపతమ్మ దేవస్థానంలో కల్యాణ వేదిక నిర్మాణానికి దాతలు రూ.1.20 లక్షల విరాళాలు అందజేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. ఏలూరు జిల్లా కాగుపాడుకు చెందిన కడియాల రంగారావు, అనురాధ దంపతులు రూ.లక్ష, విజయవాడకు చెందిన సూర్యదేవర సాంబశివరావు, విజయకుమారి దంపతులు రూ.10 వేలు, మర్లపాలెంకు చెందిన జాస్తి శ్రీహరి, ఇందిర దంపతులు రూ.10 వేలు అందజేశారు.

ఆర్థికాభివృద్ధికి యూబీఐ కృషి

పెనమలూరు: ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రతి ఇంటికీ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కృషి చేస్తుందని యూబీఐ వ్యవసాయ వ్యాపార అభివృద్ధి విభాగం జనరల్ మేనేజర్ రెను కె.నాయర్ అన్నారు. పోరంకిలో మంగళవారం మచిలీపట్నం రీజియన్ యూబీఐ ఆధ్వర్యంలో ఆర్థిక చేరిక సాచురేషన్ కార్యక్రమం నిర్వహించారు. రిజర్వు బ్యాంక్ డైరెక్టర్ ఏవో.బషీర్ మాట్లాడుతూ ప్రజల జీవితాలకు బ్యాంకింగ్ సేవలు ఎంతో భరోసా కల్పిస్తాయన్నారు. ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన లబ్ధిదారులకు ఒకొక్కరికి రూ.2 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఎస్‌ఎల్‌బీసీ కన్వీనర్ సీవీఎస్.భాస్కరరావు, విజయవాడ ఉప జోనల్ హెడ్ ఎం.సీతారామారావు, ప్రాంతీయ అధికారి కె.వెంకట్రావు, లీడ్ జిల్లా మేనేజర్ రవీంద్రరెడ్డి, బ్యాంకు మేనేజర్లు, అధికారులు, సిబ్బంది, బ్యాంకు ఖాతాదారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

పెనమలూరు: ఇద్దరు మిత్రుల మధ్య తలెత్తిన గొడవ కత్తి పోట్లకు దారి తీయటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకరమణ తెలిపిన వివరాల ప్రకారం.. గంగూరు చేపలకుండీల వద్ద ఉంటున్న పాపాన అఖిల్ కుమార్‌రెడ్డి, అక్కడే ఉంటున్న అంద్రాజు రాజు మిత్రులు. అయితే సోమవారం అఖిల్‌కుమార్‌రెడ్డి చేపల కుండీల వద్ద ఉన్న రాజు వద్దకు వచ్చాడు. ఇద్దరు కొద్ది సమయం మాట్లాడుకున్నారు. అఖిల్ కుమార్‌రెడ్డి బైక్ కావాలని రాజును అడగ్గా నిరాకరించటంతో అఖిల్‌కుమార్‌రెడ్డి బైక్ తాళం లాక్కుని వెళ్లే యత్నం చేశాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. రాజు ఆగ్రహంతో కత్తితో అఖిల్‌కుమార్ రెడ్డిపై దాడి చేశాడు. గాయపడిన అఖిల్‌కుమార్‌రెడ్డిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జయరాజుకు జాతీయ ప్రతిభా పురస్కారం

కంకిపాడు: శ్రీశ్రీ కళావేదిక ప్రతిష్ఠాత్మక సింగర్స్ ఫెస్ట్ ఈవెంట్‌లో కంకిపాడుకు చెందిన గాయకుడు గాలంకి జయరాజుకు స్వర కిరీటి జాతీయ ప్రతిభా పురస్కారం దక్కింది. ఈనెల 9న ఏలూరులో సంస్థ అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో తెలుగు సంగీత ప్రతిభావేదిక నిర్వహించారు. కంకిపాడుకు చెందిన జయరాజు ప్రతిభ కనబర్చారు. జయరాజుతోట్లవల్లూరుమండలం బొడ్డపాడు యూపీ స్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు జయరాజును ఎస్‌టీయూ నేతలు అభినందించారు.

కాలువలో దూకి యువకుడి ఆత్మహత్య

పెనమలూరు: యనమలకుదురు గ్రామ పరిధి బందరు కాలువలో యువకుడు దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు గ్రామానికి చెందిన ఎం.శివరామకృష్ణ పెయింటర్. కుమారుడు పునీత వర్మ (20) కూడా పెయింటర్‌గా చేస్తున్నాడు. అతను సోమవారం రాత్రి గ్రామ పరిధిలోని జన్మభూమి వంతెన పై నుంచి బందరు కాలువలో దూకాడని స్థానికుల ద్వారా శివరామకృష్ణకు సమాచారం తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందంతో మంగళవారం బందరు కాలువలో గాలించారు. పునీత్‌వర్మ మృతదేహం వంతెన సమీపంలో దొరికింది. మృతుడికి ప్రేమ వ్యవహారం ఉందని, యువతిని వివాహం చేసుకోవటానికి నిర్ణయం తీసుకోగా, ఆమె సహకరించక పోవడంతో పునీతవర్మ మనస్తాపానికి గురయ్యాడని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతికి నివాళి

అజ్జంపూడి(గన్నవరం): అజ్జంపూడికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దొడ్ల జోగేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని మంగళవారం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, వైస్ ఎంపీపీ సాతులూరి శివనాగరాజకుమారి, సర్పంచ్ కంచర్ల చిన్నా, ఎంపీటీసీ దొడ్ల స్వర్ణకుమారి సందర్శించి వైఎస్సార్‌సీపీ జెండాను కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోగేశ్వరరావు కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. పార్టీ నాయకులు మెండెం రాంబాబు, నిడమర్తి రామారావు, సాతులూరి రవిప్రకాష్ నివాళులర్పించారు.

టైలర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో ఉన్న టైలరింగ్ రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర టైలర్స్ ఫేడరేషన్ మాజీ చైర్మన్ ఆకాశపు స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం హనుమాన్‌జంక్షన్ విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని, టైలరింగ్ దుకాణాలకు ఉచిత విద్యుత్ సదుపాయాన్ని కల్పించాలని కోరారు. హనుమాన్‌జంక్షన్ టైలర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రెడ్డి నరసింహారావు, తాడి శ్రీనివాసరావు, కొమ్మూరి సాంబశివరావు, షేక్ కరీముల్లా, గంపల రమణ, రెడ్డి లత, తోట చంద్రిక పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కంకిపాడు: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ కంకిపాడు ప్రాజెక్టు మహాసభ మంగళవారం కంకిపాడులో నిర్వహించారు. మినీ అంగన్‌వాడీల జీఓను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రాజెక్టు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా వై.నళినీకుమారి, కార్యదర్శిగా ఎం.రేవతి, కోశాధికారిగా లక్ష్మీప్రసన్న, ఉపాధ్యక్షురాలిగా బీ.కాళేశ్వరి, సహాయ కార్యదర్శిగా ఎం.రమాదేవిని ఎన్నుకున్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

పెనమలూరు: ఔత్సాహిక పారిశ్రాయిక వేత్తలను ప్రోత్సహించటానికి ప్రభుత్వం అడుగులు వేస్తోందని జిల్లా పరిశ్రమల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ పి.ప్రదీప్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉద్యం రిజిస్ట్రేషన్ పోర్టల్ నమోదుకు క్యాంపు నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తెంపల్లి(గన్నవరం): తెంపల్లి గ్రామానికి చెందిన సద్భుర్తి వీరాంజనేయులు (30) వ్యవసాయ కూలీ. మద్యం కొనేందుకు తల్లి డబ్బులు ఇవ్వకపోవడంతో ఈ నెల 9న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.